# వలుపు

మిట్ట మద్దేన్నం, ఎండ నిప్పులు చెరుగుతూ వుంటే గాలికి కొట్టుకు వచ్చిన మేగం – పెద్ద వాన కురిసి పట పట పటాల్ మని పిడుగును వదిలిపెట్టి గాలికి కొట్టుకుపోయింది.

మాం పొలం దున్ని ఏరుశనగ ఏసినాం. దాంతో సరి. మెరుపు పట్టుకున్నాది. కార్తె కార్తె తరవాత కార్తె ఎల్లిపోతున్నాయి. ఏ కార్తే వొరుపే.

అదిగో మళ్లా మగ కార్తిలో వోనొచ్చింది. పదుతల్లే పదుపదుమని ఆకాశం వంక అంతా అర్రులు సాచినాం. సిన్న వాన పడ్డంపడింది. శాన. దాంతో వొరి ఇతనాలు నారు మళ్లలో జల్లినాము.

పట్టుకుంది వొరుపు. ఆకాశంలో ఎక్కడా మెరుపే లేని వొరుపు.

నీతీ నిజాయితీ – మనుషుల్లో సచ్చినాయి. నీతి – ఆకాశానికీ సచ్చింది. నెలకి మూడు వోనలు కురిసీవట! ఇప్పుడేదీ ఆ నీతి?

దాందర్మమా అని పొద్దు – ఏళకి పొడుస్తున్నాది. రేతిరి – ఏళకి అవుతున్నాది. ఆ సూరె బగవానుడు – ఆ నీతి తప్పితే మన గతులు ఏటవుతాయి.

పంచాయతీ రేడియో సాయంకాలం అరిస్తే మా కొండల్లోకి ఇనపడతాది. ఇశాకపట్నం కాడ వోయు గుండం వున్నాది. వచ్చి పడిపోతున్నాది. గాలీ వానా అంటే పొద్దున్న అదే రేడియో ఏటో సెపుతుంది? వోయుగుండం మన్ని దాటెల్లిపోయి వొడ్డి దేశాన్ని ఓ బాదు బాదిందని సెపుతాది!

ఇక్కడ మనకేటి పడ్డాది? తుంపర్లు పట్టుకున్నాయి. పొలాల కెల్లి పచ్చగడ్డి బరకనేము. సిటుకు సిటుకు సినుకులు. ఇంట్లో కూకోనేము! వారం రోజులు సిటుకు సిటుకు సిన్న సినుకులు.

ఆ దిక్కుమాలిన ఆకాశాన్ని నమ్ముకుని తరతరాలు బతుక్కొస్తున్నాము.

బూదేవత పెరగనేదు. మాం పెరిగీసినం! మా ముత్తాత ఒక్కడే. ఇప్పుడు, మాం పాతికిళ్ల వాళ్లం! ఆ బూదేవతని నమ్ముకుని పాతిక సంసారాలు ఆ ఆకాశాన్ని నమ్ముకునే గండాల బతుకులు బతుకుతున్నాం.

దగ్గరలోనే కొండవాగులున్నాయి. వాటి నీళ్లు కాస్త పైకెత్తి మా సెరువుల్లోకి మళ్లిస్తే మా కెందుకీ గతి? నూసేనాదుడు నేదు! చేసేనాదుడు నేదు!

వొరి ఇత్తనాలు ఆకుమళ్లలో ఏసినామా? అందులో నారు నెగడానికి తడి? బావుల్లో వూటనేదు, సెర్లో సుక్క నీరు నేదు. ఆకాశంలోంచి టక్కని ఒక్క సినుకు నేదు. వొరుపు వొరుపు ఒకటే వొరుపు. ఉసూరుమని సూస్తూ వుండగా వొరాకు సుట్టుకుపోయి సుట్టుకుపోయి ఎండిపోనాది. ఏరుశనగ బెత్తెడు కొనసాగనేదు. ఆకులు నులుచుకుని ముడుచుకుపోతున్నాయి.

ఐపోయింది మా పని. ఇకనేటుంది? ఈనాటున గేమాలు గేమాల పెజ మలమలమాడి సావవలసిందే! వూళ్లన్నీ సెల్లాసెదరై పోతున్నాయి. ఆడా, మగా సత్తువున్న వాళ్లంతా పట్నాలకి పిట్టల్లా గెగిరిపోయారు. అంతా తలోదారీ పట్టేశారు.

నా కొడుకు లిద్దరూ – ఆళ్లకి ఆళ్లే – కటకం పోదాం – అనీసుకున్నారు.

మావి మారుమూల కుగ్రామాలు. కూలీనాలీ చేసుకు బతకడానికి దగ్గరలో పట్నమన్నది నేదు. సుట్టుపక్కల ఎక్కడా మిల్లు గొట్టం నేదు!

నా పెద్ద కొడుకే – ఎక్కడ తెచ్చినాడో – నెలకి రూపాయికి పావలా వడ్డీకి అప్పు కటకం ఎళ్లడానికి. అక్కడ మాకు అయినోళ్లు వున్నారు. ఎంటనే కూలి పలుకుతాది. మావాళ్లు పనిలో వొళ్ళుదాచుకోరు. అళ్ళ పని సూస్తే ఎవ్వళూ వగ్గరు.

పిల్లల్ని మాకాడ వొగ్గేసి పెద్ద కొడుకు ఎల్లినాడు. పెళ్లాన్ని మాకాడ వొగ్గేసి సిన్న కొడుకు ఎల్లినాడు. సిన్న కోడలు ఎళ్లడం మాం ఇష్టపడనేదు.

ఎందుకంటారా? మా వూరి కుర్రాడే – సిన ఎంకటప్పుడు ఆడి పెళ్లాం కటకం ఎళ్లి ఏటిసేసింది? కటకీ అయ్యింది. నెగిసిపోయింది మొగుణ్ణొగ్గేసి ఎవడి తోనో, మరి అతీగతీ నేదు!

వయసులో వున్న ఆడదాన్ని కూలికి పంపడం పెద్ద నఖారా, కటకం ఎళ్లినారు మావోళ్లు.

అక్కడ ఆళ్లుబతకాల. మాం ఇక్కడ బతకడానికి పంపాల. అప్పులు తీర్చాల ఎవసాయానికి మదుపులు తేవాల! సంకురుమాణానికి ఇంటికి రారు. శివరేత్రికైనా వస్తారో రారో. రాదు. తొలకరి దాకా అళ్ల మొకాలు మరి కనబడవు.

గవర్నమెంటోళ్లు అప్పులిస్తున్నారంటే ఎగబడ్డాము. అప్పు పుట్టడానికి కాయితాలు రాయించినాము. ఉద్యోగం ఊడిపోయిన కరణంగారే రాసినారు. మా వూరి పెసిడెంటు కాణ్ణుంచి తాసిల్దారాఫీసు బంట్రోతుదాకా సెయ్యి జాపినోళ్లకల్లా ఇచ్చుకోవలిసింది ఇచ్చుకుంటే ఐదొందలు అప్పుకి సేతికి నాలుగొందలే వొచ్చినాయి! తిరిగి మాం ఐదొందలిచ్చుకోవాల. ఐదొందలకి వడ్డీ ఇచ్చుకోవాల. కాబూలోడి అప్పేనయం!

ఎంత నష్టమొచ్చినా – ఆ పాటి దబ్బు సేతిలో నేకపోతే గుండె దిటం వుండదు.

పంటలన్నీ వొల్లకాట్లో కలిశాక ముసుర్లు పట్టుకున్నాయి. సెరువులూ నిండినాయి.

పచ్చగడ్డి బాగా నెగిసింది. తలో బుంగడు గడ్డీ బక్కురుకొస్తే పశువుల మొర్ర తీరుతుంది.

అకాలపు వోనలైనా ఏదో వొకటి సెయ్యాలికదా? గుత్తి ఏరుసెనగ నాలుగు సిన్న మళ్ళు ఏసినాము. సోడిసేను ఊడిచినాము.

అవి గాని కుసింత పండినాయంటే నాలుగు పొద్దులు మా కడుపుమంటుందే అది కాస్త సల్లారుతాదని ఆశ.

సిన్న ఆశ!

(వఱవు అంటే అనావృష్టి, కరువు అని అర్థం)

❋

ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక, 22.1.88

కథా నిలయం
శ్రీకాకుళం